క్లుప్తంగా

భక్తి తత్వం ఎంతో గొప్పది



ప్రవచనం చేస్తున్న మురళీకృష్ణ

సింహాచలం: మానవుని జీవన విధానంలో భక్తి తత్వం ఎంతో గొప్పదని ప్రముఖ హైందవ ప్రవచన కర్త కె.మురళీకృష్ణ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో 98వ వార్డు పరిధి గోపీజనవల్లభ స్వామి ఆలయంలో గురువారం భాగవత ప్రవచన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రవచనకర్త మురళీకృష్ణ హిందూ ధర్మం విశిష్టత, భక్తిభావం గురించి భారతం, భాగవతంలోని పలు ఘట్టాల ఆధారంగా భక్తులకు వివరించారు. భాగవతం చదివినా, విన్నా ఎంతో పుణ్యం చేకూరుతుందన్నారు. ముక్తికి భక్తి మార్గమే ప్రధానమని తెలిపారు. ఆలయ నిర్వాహకుడు చాగంటి కోటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-1 పరిధి 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ స్థానిక ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆయా ఫీడర్ల పరిధిలోని సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, అసకపల్లి, ఇరువాడ పంచాయతీల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

వైభవంగా సీతారాముల తీర్థమహోత్సవం



ఆదిరెడ్డిపాలెంలో సీతారాములను దర్శించుకుంటున్న కొటాన రాము తదితరులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెం గ్రామంలో కొలువైన సీతారాముల తీర్థమహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ధూపదీప నైవేద్యాలను సమర్పించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. సాయంత్రం గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామివారిని దర్శించుకున్న వారిలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొటాన రాము, ఆర్‌ఈసీఎస్ మాజీ అధ్యక్షుడు కొటాన అప్పారావు, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, మాజీ వైస్ ఎంపీపీ కొటాన కోటయ్య తదితరులు ఉన్నారు.

జూదమాడితే జైలే



కె.వి.సతీష్‌కుమార్, పెందుర్తి సీఐ

పెందుర్తి: గ్రామాల్లో జరుగుతున్న పరసలు, తీర్థాల్లో జూదాలు, కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిషేధమని పెందుర్తి సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఇటీవల కాలంలో పందాలు ఆడుతున్న వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు, పెందుర్తి ప్రాంతంలో పందాలు ఆడే, కోళ్లకు కత్తులు కట్టే వారిని పిలిపించి బైండోవర్ చేశామన్నారు. పందాలు నిర్వహించేవారు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదన్నారు. ప్రజలు కూడా ఇటువంటి వాటిపై తమకు సమాచారం అందించి, సహకరించాలని కోరారు. జూదం, పందాలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వారు 94407 96039, 0891-2764233 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఒకనాటి ఉద్యానవనమూ..



తుప్పలతో నిండిన పరవాడ ఉద్యానవనం



పెరిగిన పిచ్చిమొక్కల మధ్య పాడైన ఊయల, జారుడుబల్ల

- కళా విహీనంగా మారిన సంతబయలు పార్కు
- రూ.30 లక్షలతో తీర్చిదిద్దిన లుపిన్ ఫార్మా ఫౌండేషన్
- నిర్వహణ గాలికి వదిలేసిన పంచాయతీ అధికారులు

రూ.లక్షలు వెచ్చించి పరవాడ మండలంలోని సంతబయలులో ఏర్పాటు చేసిన పార్కు నిర్వహణ లోపంతో కళావిహీనంగా మారింది. దాదాపు నాలుగేళ్లు స్థానికులకు ఎంతగానో ఉపయోగపడిన ఈ పార్కు ప్రస్తుతం తుప్పలు, డొంకలమయమైంది. పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ పూర్తిగా పాడయ్యాయి. కనీసం సేదతీరేందుక్కూడా వీల్లేని స్థితికి చేరిన ఈ పార్కును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.



అలంకారప్రాయంగా ఎల్‌ఈడీ లైట్లు



రిపేర్లకు నోచుకోని విద్యుత్ దీపాలు

పరవాడ: పరవాడ ప్రాంత ప్రజల సౌకర్యార్థం సంతబయలు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఉద్యానవనం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. సకల సౌకర్యాలతో.. ఎంతో సుందరంగా నిర్మించిన పార్క్‌ను పాలకులు పట్టించుకోకపోవడంతో తుప్పలు, డొంకలు భారీగా పెరిగిపోయాయి. అధ్వానంగా మారిన ఈ పార్క్‌లో అడుగుపెట్టేందుకు సందర్శకులు, స్థానికులు భయపడుతున్నారంటే పార్కు ఏ దుస్థితికి చేరుకుందో తెలుసుకోవచ్చు.

రూ.30 లక్షలు వెచ్చించి..

లుపిన్ ఫార్మా ఫౌండేషన్ 2019లో రూ.30 లక్షల వ్యయంతో సంతబయలులో పార్క్‌ను అభివృద్ధి చేసింది. అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసి, నిర్వహణ బాధ్యతను స్థానిక పంచాయతీకి అప్పగించింది. పార్క్‌లో చిన్నారుల కోసం జారుడు బల్లలు, ఉయ్యాలలు తదితర ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. పెద్దలకు అవసరమైన వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టులతో పాటు పార్క్‌లో కాసేపు సేదదీరేందుకు అవసరమైన బల్లలను ఏర్పాటు చేశారు. ఉద్యానవనం చుట్టూ ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలు, పూల మొక్కలు, పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దారు. రాత్రి వేళ విద్యుత్ దీపాల వెలుగులో ఈ పార్క్ అందాలు జిగేల్ మనిపించేవి. అయితే ఇవన్నీ మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి.

నిర్వహణలో పంచాయతీ నిర్లక్ష్యం

కొంతకాలం పార్క్ నిర్వహణ బాధ్యతలను పంచాయతీ అధికారులు సక్రమంగానే చేపట్టారు. ఆ తర్వాత నిధుల లేమితో ఉద్యానవన బాధ్యతను గాలికి వదిలేశారు. దీంతో పార్క్ ప్రాభవం క్షీణిస్తూ వచ్చింది. సరైన పర్యవేక్షణ లేక పార్క్‌లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయి విషపురుగులకు నిలయంగా మారింది. ఇక్కడి విద్యుత్ దీపాలు కూడా మరమ్మతులకు గురై, వెలగడం మానేశాయి. పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. వర్షాలకు తడిసి ఇనుప బల్లలు, ఆట పరికరాలు, విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టి మూలకు చేరాయి. ఆలనాపాలనా లేని పార్క్‌లో ఆకతాయిలు చేరి, అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్క్‌ను అభివృద్ధి చేయాలి



అధ్వానంగా మారిన పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలి. పర్యవేక్షణ లోపంతో తుప్పలు, డొంకలు పెరిగి, పార్క్‌లో అడుగు పెట్టాలంటే భయపడుతున్నాం. సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన బల్లలు, కుర్చీలు పాడైపోయాయి. చిన్నారుల ఆట పరికరాలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. వాకింగ్ ట్రాక్ తుప్పల మధ్య కనిపించకుండా పోయింది.

– పైల సత్యనారాయణ, సందర్శకుడు, పరవాడ

త్వరలో పనులు చేపడతాం



పంచాయతీలో నిధుల లేమి కారణంగా పార్క్ పునరుద్ధరణ పనులు చేపట్టడంలో కొంత జాప్యం నెలకొంది. పార్క్‌ను యథాస్థితికి తీసుకురావడానికి అవసరమైన చర్యలపై పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లాం. సమస్యను ఏ విధంగా పరిష్కరించాలన్న దానిపై పాలకవర్గం చర్చలు జరుపుతోంది. త్వరలో సమస్య పరిష్కారం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

–మురళీధర్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి, పరవాడ

జనసైనికుడి ఆక్రమణ తొలగింపు



రెవెన్యూ అధికారులు తొలగించిన షెడ్


సాక్షి ఎఫెక్ట్..

పెందుర్తి: మండలంలోని కృష్ణరాయపురం జ్యోతినగర్ చెరువులో ఓ జనసైనికుడు అక్రమంగా నిర్మించిన షెడ్డును రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. ఈ నెల 22న 'చెరువు కబ్జాలో జన సైనికుడు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. జన సైనికుడు దొంగ పట్టాలు సృష్టించి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, షెడ్లు నిర్మించి అమ్మకాలు సాగిస్తున్న వైనాన్ని ఈ కథనం ద్వారా సాక్షి బయటపెట్టింది. ఈ కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది గురువారం చెరువులోని ఆక్రమణలను తొలగించారు. ఇక మీదట ఎవరైనా చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

పెందుర్తి: పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ఏడుగురిని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపర్చగా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడు కేసుల్లో ఉన్న ఏడుగురికి చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.70 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభం వద్ద చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధానార్చకుడు రంగరాజన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధానార్చకుడు సి.ఎస్.రంగరాజన్, దేవదాయశాఖ ట్రిబ్యునల్ సభ్యురాలు పద్మ స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు.



ట్రిబ్యునల్ సభ్యురాలు పద్మకు ప్రసాదం అందిస్తున్న ఏఈవో

సైకిల్ స్టాండ్ నిర్మించరూ..



హైస్కూల్ వెనుకవైపు సైకిళ్లను పార్క్ చేసిన విద్యార్థులు

పరవాడ: ధర్మారాయుడుపేట జెడ్పీ హైస్కూల్లో సైకిల్ స్టాండ్ లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలలో 162 మంది విద్యార్థులు చదువుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి సైకిళ్లపై పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పాఠశాల లోపల, వారి సైకిళ్లను నిలిపే వీలుండేది. పాఠశాలకు అవసరమైన ఆట స్థలం లేకపోవడంతో పాఠశాల లోపలి ఖాళీ స్థలంలో చిన్న ఆట స్థలాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీంతో లోపల ఉన్న సైకిల్ స్టాండ్‌ను పాఠశాల వెనుక భాగంలోకి మార్చారు. సైకిళ్లను ఆరు బయట వదిలిపెట్టడడంతో ఎండా, వానలకు పాడైపోతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి పాఠశాల వద్ద సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



108 స్వర్ణ సంపెంగ పుష్పాలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు.

ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అపరాలకు 'పల్లాకు తెగులు'



మినప, బొబ్బర మిశ్రమ పంట



ఉలవ చేను

- నస్యరక్షణ చర్యలు తీసుకోకపోతే నష్టం

పెందుర్తి: రబీ సీజన్‌లో వరి కోతల అనంతరం వేసిన అపరాలు సాగు ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పచ్చదనాన్ని సంతరించుకుంటున్న పెసర, మినప, రాగి పంటలతో పాటు నేరుగా వేసిన వేరుశనగ నువ్వు పంటలకు కొన్ని ప్రాంతాల్లో పల్లాకు(ఎల్లో మొజాయిక్) తెగులు సోకే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గంలోని పెందుర్తి, సబ్బవరం మండలాల్లో ఈ తెగులు అక్కడక్కడ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెల్లదోమ కారణంగా వ్యాపించే ఈ తెగులును ఆదిలోనే నివారించకపోతే పంటకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. తెగులును గుర్తించిన వెంటనే రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ సూచించారు.

సస్యరక్షణ చర్యలు

- పెసర, మినుము పంటల్లో పల్లాకు తెగులు ప్రభావం అధికంగా ఉంటే దాని నివారణకు లీటరు నీటిలో 1.6 మి.లీ. మోనోక్రోటోపాస్/ 2 మి.లీ. డైమిథోయెట్ లేదా 1 గ్రాము ఎసిఫెట్ రసాయనాన్ని పిచికారీ చేయాలి.
- పూర్తిగా తెగులు సోకిన మొక్కను పీకేసి కాల్చేయాలి.
- బూడిత తెగులు నివారణకు లీటరు నీటిలో 1 గ్రాము కార్బాండిజమ్/ 1 గ్రాము థయోఫనేట్ మిథెల్ కలిపి చల్లాలి.
- వేరుశనగలో ఆకుముడత, రసం పీల్చే పురుగులు ఆశిస్తే మోనోక్రోటోపాస్ 320 మి.లీ., వేపనూనె లీటరు, కిలో సబ్బుపొడి మిశ్రమాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు ఎకరా పంటకు వేయాలి.
- వేరుశనగ తొలిపూత సమయంలో ఎకరాకు 200 కిలోల జిప్సంను కలుపు తీసేటపుడు మొక్కల మొదళ్లలో వేసి మట్టిని ఎక్కువగా కప్పితే ప్రయోజనం ఉంటుంది.

పశు ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన



పశువులకు వైద్య సేవలు అందిస్తున్న పరవాడ పశువైద్య శాఖ ఏడీ రామకృష్ణకీర్తి



బోదువలసలో పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్య సిబ్బంది

పరవాడ: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలో ఈ నెల 20 నుంచి నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు పాడి రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోందని స్థానిక పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణకీర్తి తెలిపారు. మండలంలోని వెన్నలపాలెం, మూలస్వయంభూవరం గ్రామాల్లో గురువారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిబిరాలను పాడి రైతులంతా వినియోగించుకొని తమ పాడి సంపదను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఐదు సెంట్ల బహువార్షిక పశుగ్రాసాలను పెంచుకొన్న రైతులకు ప్రభుత్వం రూ.32 వేల ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఈ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగపర్చుకుని పాల దిగుబడిని పెంపొందించుకోవాలని సూచించారు. వెన్నలపాలెం, మూలస్వయంభూవరం గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాల్లో 526 పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు త్రాగించి, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. లింగ నిర్ధారణ వీర్య నాళికల్ని వినియోగించి ఆడ పెయ్యలను పొందడం ద్వారా పాల ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో వాడచీపురుపల్లి, లంకెలపాలెం పశువైద్యులు సురేష్ కుమార్, అశ్వినిప్రఫుల్ల, వైద్య సిబ్బంది బాలాజీ, భాస్కర్, పద్మ, నూకరత్నం, లక్ష్మణ్, కృష్ణ, సన్యాసి నాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం: పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గుల్లేపల్లి పశు వైద్యురాలు డాక్టర్ బి.సంధ్య సూచించారు. మండలంలోని బోదువలస గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న 18 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 32 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సను అందించారు. 8 చూడి ఆవులకు తనిఖీలు నిర్వహించారు. 54 లేగదూడలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంతకోరు సూర్యనారాయణ, గ్రామ పెద్దలు కంచిపాటి రాంబాబు, డాక్టర్ స్వర్ణలత, వీపీ లక్ష్మణరావు, పశు సంవర్ధక సహాయకులు ఎ.రమేష్, డి.రమేష్, గోపాలమిత్ర దేముడుబాబు, ల్యాబ్ టెక్నీషియన్ మళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుల్లాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్



గుల్లాట అడుతూ పట్టుబడిన వ్యక్తులతో సబ్బవరం సీఐ పిన్నింటి రమణ తదితరులు



గుల్లాట నిర్వాహకుడితో పరవాడ పోలీసులు

- వెదుళ్ల నరవలో నలుగురు, రావాడలో ఒకరు
- రూ.1.09 లక్షల నగదు స్వాధీనం

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధి వెదుళ్లనరవ శివార్లలో గుల్లాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. వారి నుంచి రూ.1,05,530 నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు, నాలుగు గుల్ల, ఒక పట్టాను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. గుల్లాట ఆడుతున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ దివ్య, సిబ్బంది కలిసి ఈ దాడులు నిర్వహించామన్నారు. వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు.

పరవాడ: మండలంలోని రావాడ శివార్లలో గుల్లాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పరవాడ ఎస్ఐ మహాలక్ష్మి తన సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. గుల్లాటకు సిద్ధమవుతున్న నిర్వాహకుడు ఎర్రా నాగేశ్వరరావును అదుపులోకి తీసుకు, అతడి నుంచి రూ.3,800 నగదు, గుల్లాటకు సంబంధించిన సామగ్రిని స్వాధీన పర్చుకున్నారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహాలక్ష్మి తెలిపారు.

హాకర్స్ జోన్ ఏర్పాటుకై నేడు ఆందోళన

పెందుర్తి: చిరు వ్యాపారులపై వేధింపులు ఆపాలని, వారికి హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రహ్లాదపురం నుంచి సుజాతనగర్ వరకు ఉన్న చిరు వ్యాపారులంతా ఈ ఆందోళనలో పాల్గొంటారని పేర్కొన్నారు.

కూడలిలో హైమాస్ట్ లైట్ల వెలుగులు



దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన కూడలిలో వెలుగులు విరజిమ్ముతున్న హైమాస్ట్ లైట్

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన కూడలిలో మరమ్మతులతో మూల్గుతున్న హైమాస్ట్ లైట్లు ఎట్టకేలకు వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఈ నెల 20న 'అసలే చీకటి.. ఆపై గోతులు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. ఇక్కడ కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ ఏడాదిగా వెలగట్లేదు. ఫలితంగా కూడలిలో అంధకారం రాజ్యమేలేది. ముందే గోతులమయంగా మారిన కూడలిలో వీధి దీపాలు లేకపోవడంతో వ్యాపార వర్గాలతో పాటు విశాఖ, యలమంచిలి, పరవాడ, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు అవస్థలు పడేవారు. సాక్షి కథనం ఆధారంగా వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అధికారులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ సిబ్బంది మరమ్మతులు చేపట్టి, లైట్లను వెలిగించారు.

ఘనంగా 'కేకేఆర్ గౌతమ్' వార్షికోత్సవం



అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పెందుర్తి: చినముషిడివాడ గ్రామంలో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యా సంస్థలు దశమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు విశాఖ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గొర్లి రామునాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళ జిల్లా అధ్యక్షురాలు నాదెండ్ల జ్యోతి, కేకేఆర్ గౌతమ్ విద్యా సంస్థల వైజాగ్ జోన్ డీన్ కె.శేషబాబు, జేఈఎస్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.భవాని, ఫాక్ట్ ప్రిన్సిపాల్ కె.ప్రణీత్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.